
# పాపకి స్వాగతం

- అవధానుల సుధాకరరావు



**నాకు ప్రయాణాలంటే భలే ఇష్టం. అందునా, రైలంటే అబ్బో ... చెప్పాలా? కిటికీపక్కసీటు దొరికిందంటే, నాకిక పండుగే! ఆ పరవశంలో ప్రపంచాన్నే మరచిపోతాను. ఆకలిదప్పులు గుర్తుకి రావు.**

కానీ ఆ రోజు అందుకు భిన్నంగా ఉంది నా పరిస్థితి. తెలతెలవారుతున్న వేళ స్నానాదికాలు ముగించుకుని, ఇంటిదగ్గర ఫ్రెష్‌గానే బయల్దేరాను. ఎక్కింది సూపర్ ఫాస్ట్ రైలే. అన్నీ చక్కగా అమరి, ప్రయాణం సుఖంగానే సాగుతున్నా, మనసుకి సంతోషం ఏది? ప్రకృతి అందాలు, పరిసరాలు గమనించాలనే ధ్యాస లేదు. కూనిరాగాలు తీసే గొంతు మూగవోయింది.

చిరాకు, చీదర!

విసుగు, అసహనం!

కసి, కోపం...ఎందుకని? ఎవరిమీద? నన్నెవరో దగా చేసినట్లు, నయవంచనతో నిలువునా మోసం చేసి ముంచినట్లు ... ఏమిటేమిటోగా ఉంది.

పాంటుజేబులో రుక్కూ రాసిన ఉత్తరం గుచ్చుకుంటున్నట్టుగా ఉంది. అసలదే కదూ నా ఈ బాధకంతా కారణం? రాత్రంతా నిద్ర కూడా పోనివ్వలేదు. కోపంగా దాన్ని బయటకు తీసి, నలిపి, ఉండచుట్టి, బలం కొద్దీ కిటికీలోంచి గిరాటు కొట్టాను.

"డామిట్!" ఈ పాడుఉత్తరమే నా ఆశలు, కలల్ని చెల్లాచెదురుచేయడమే కాదు, నన్ను బాగా అప్‌సెట్ చేసింది. నా అంచనాలు తారుమారు చేసిన ఘోరమైన దుర్వార్త! ఎంత నిరుత్సాహాన్ని కలిగించిందో! మాకు పుట్టబోయేది అమ్మాయట! కొడుక్కోసం తనెన్ని కలలు కన్నాడో! ఆఫ్టరాల్ ఆడపిల్ల! ఎవడిక్కావాలి? అమ్మాయి పుట్టడమంటే అన్యాయం జరిగినట్లే. తను ఊరు కుంటాడా? ఒప్పుకుంటాడా? స్కానింగ్ రిపోర్టు గురించి నిన్న రుక్కు రాసిన ఉత్తరం చదివిన మరుక్షణమే తనో తిరుగులేని నిర్ణయానికొచ్చేశాడు. పుడితే వంశోద్ధారకుడు, లేకపోతే సంతానమే వద్దు!

ఇప్పుడు రుక్కుకి అబార్షన్ చేయించడానికి వెడుతున్నాడు. కొడుకు పుట్టేలా చేయడం తన చేతుల్లో లేకపోవచ్చు గానీ, ఇష్టం లేని ఆడపిల్లని సంతానంగా పొందకుండా ఉండడం సాధ్యమేగా?

రుక్కుకి గర్భవిచ్ఛిన్నం జరిగింతర్వాతే, తన మనసు నెమ్మదిస్తుంది.

మళ్లీ వచ్చే కాన్పుకి అబ్బాయయితే సరి, లేకుంటే అప్పుడూ ఇదే దారి.


అమ్మాయి తండ్రిగా అగచాట్లపాలు కావడం తనకిష్టం లేదు.

వరంగల్ స్టేషన్లో రైలాగితే కాఫీ కోసం కిందకు దిగాను. మళ్లీ వచ్చేసరికి ఖాళీగా ఉన్న నా ఎదుటి సీటు భర్తీ అయింది. కాలక్షేపం దొరికినందుకు సంతోషపడ్డాను. ఎంతసేపని ఒంటరితనం భరిస్తాం? పైగా మనసలే బావోలేదు.

వాళ్లు ముగ్గురు. భార్యా, భర్త, వెంట ఓ ముసలాయన. రైలు ఖాజీపేట దాటి, బాగా వేగం అందుకుంది. నేను యథాలాపంగా వాళ్లనే గమనిస్తున్నాను. ముచ్చట గొలిపే ఓ దృశ్యం కళ్లారా చూస్తున్నాను. ఎంతో అపురూపమైన సన్నివేశం అది.

వృద్ధులపట్ల శ్రద్ధ కరువుతున్న ఈ రోజుల్లో ముసలివాళ్లని విసుక్కుంటూ, కసురుకుంటూ అసహ్యించుకుంటున్న నేటివ్యవస్థలో - వాళ్లిద్దరూ ఆ ముసలాయనపట్ల చూపుతున్న ప్రేమాదరణలు నన్ను మురిపిస్తున్నాయి.

ఆమె - "నాన్నా! ఈ టాబ్లెట్ వేసుకో!", "ఈ టానిక్ తాగు!" అంటూ మరికాసేపటికి, కొబ్బరి నీళ్లు అందిస్తూ, బత్తాయిపండు వొలిచిపెడుతూ తండ్రినెంతో మృదువుగా చూసుకుంటే ఉంటే, అతగాడు మరెంతో మృదువుగా, "మావగారూ! ఈ అరటిపండు తినండి!" అంటూ తర్వాత కాస్త వ్యవధి అనంతరం తనే ఆపిల్ ముక్కలు కోసి, ఏవేవో కబుర్లు చెబుతూ వాటిని కూడా ఆయనచేత తినిపించడం ... ఇవన్నీ చూస్తుంటే నాకు ఆ ముసలాయన అదృష్టం మీద అసూయ కలిగింది.




గత జన్మలో ఎంతపుణ్యం చేసుకున్నాడో? అనుకున్నాను. నేను మనసులో ఆయన గురించే ఆలోచిస్తున్నానని ఎలా పసిగట్టాడో, నాకేసి చూసి, పలకరింపుగా నవ్వేడు. నేనూ నవ్వేను సమాధానంగా.

"బాబూ! నీకు పిల్లలెంతమంది?" అంటూ నాతో మాట కలిపాడు.

"ఇంకా లేదండీ! మా ఆవిడ కడుపుతో ఉంది. ఆడపిల్లఅని స్కానింగ్‌లో తేలింది!"

"మంచి శుభవార్తోయ్! అదృష్టవంతుడివి. అమ్మాయి తండ్రి కావడమంటే అసూయపడదగినంత లక్కీఛాన్స్ అన్నమాట!"

"కానీ, నాకు కొడుకు కావాలనుందండీ!"

'హుఁ,కొడుకులు! ఈ కంప్యూటర్ యుగంలో కూడా ఇంకా అలాంటి చాదస్తపు భావాలేంటయ్యా? నీలాంటి చదువుకున్న యువకులు, ఆలోచనాపరులు కూడా ఇంకా ఆ పాతకాలపు ఆలోచన్ని అంటిపెట్టుకునిఉండడం విచారకరం!'

"నాకు ముగ్గురు కొడుకులున్నారయ్యా! వాళ్లు ఎదిగి, ప్రయోజకులయ్యారు. కానీ ఏంలాభం? ఒక్కడన్నా నా అతీగతీ పట్టించుకోలేదు. నన్ను చచ్చినవాడి కింద జమకట్టి లెక్కల్లోంచి తీసేశారు. నేను సంపాదించిన ఆస్తుల్ని స్వీకరించేరు కానీ, నన్ను భరించడం కష్టమైపోయి, బయటకు నెట్టారు.

"అప్పుడు నాకు - ఇదిగో, నా కూతురు, అల్లుడు దిక్కయ్యారు. నన్ను అక్కున చేర్చుకున్నారు!" చెప్పడం ఆపి, అలసటగా వెనక్కువాలి, కళ్లు మూసుకున్నారు.

నా కళ్లు తెరుచుకున్నాయి. ఇప్పుడు మనసులో వివేకం మొలకెత్తాక అనిపించింది - అంత అజ్ఞానంగా, మూర్ఖత్వంగా నేను ఎలా ఆలోచించానా అని? కళ్లారా చూసిన జీవితసత్యం పాఠం నేర్పి, కనువిప్పు కలిగించింది. ఇప్పుడు నా మనసు ఉల్లాసంగా, హర్షంతో నిండిపోయింది. పుట్టబోయే పాపాయి తాలూకు ఆలోచనలు, మధుర భావాలతో మైమరిచిపోయాను. బయట సన్నగా వాన చినుకులు పూలజల్లుల్లా నన్నభినందిస్తున్నట్టు ... అభిషేకిస్తున్నట్టు ...

నా మనసులో ప్రవేశించిన ఉత్సాహంలాగే రైలు వేగంగా, చకచకా సాగిపోతోంది.

చెట్లు, పుట్టలు, వాగులు, వంకలు ... వాటిని చూస్తూ మా అమ్మాయికో అందమైన పేరు గురించి ఆలోచించడం ప్రారంభించేను.

పాపకి స్వాగతం పలుకుతూ సందడి చేస్తోంది నా పితృహృదయం.